సాక్షి వికారాబాద్

శనివారం । 3 । మే । 2025




బీఎస్ఎన్ఎల్ సేవలు డీలా

భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ (బీఎస్ఎన్ఎల్) సంస్థ సేవలు నానాటికీ కనుమరుగవుతున్నాయి. 10లో▸



రద్దీ ప్రదేశాలే లక్ష్యం

రద్దీ ప్రదేశాలను లక్ష్యంగా చేసుకుని, దొంగతనాలకు పాల్పడుతున్న ముఠాను పోలీసులు కటకటాల్లోకి నెట్టారు. 10లో▸



'చింత' తీరేనా?

చింతకుంట – ధారూరు గ్రామాల మధ్య కాగ్నా ఉపనదిపై వంతెన నిర్మాణం అసంపూర్తిగానే దర్శనమిస్తోంది. 11లో▸

న్యూస్‌రీల్

పశువులకు టీకాలు

జిల్లా పశువైద్య డైరెక్టర్ సదానందం



పశువులకు టీకాలు వేస్తున్న వైద్యాధికారులు

మోమిన్‌పేట: జిల్లాలో రెండు లక్షల పశువులకు గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలు వేస్తున్నట్లు జిల్లా పశువైద్య డైరెక్టర్ సదానందం తెలిపారు. శుక్రవారం మండలంలోని ఎన్కేపల్లిలో పశువులకు టీకాలు వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా 60 బృందాలు 2లక్షల పశువులకు గాలి కుంటు నివారణ టీకాలు వేస్తున్నట్లు పేర్కొన్నారు. త్వరలో పశు గణన కార్యక్రమం చేపట్టనున్నట్లు వివరించారు. పశువులకు టీకాలు వేయించకపోతే నష్టాలు తప్పవని హెచ్చరించారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉప పశువైద్యాధికారి కుసుం, వైద్య సిబ్బంది, కార్యదర్శి తిరుపతమ్మ తదితరులు పాల్గొన్నారు.

డీసీహెచ్ఎస్‌గా డాక్టర్ ఆనంద్



అనంతగిరి: వికారాబాద్ జిల్లా ఇన్‌చార్జ్ డీసీహెచ్ఎస్‌గా డాక్టర్ టి.ఆనంద్‌ను నియమిస్తూ తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఆయన వికారాబాద్ ఏరియా ఆస్పత్రిలో సివిల్ సర్జన్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ ఆనంద్ మాట్లాడుతూ.. జిల్లాలో మెరుగైన వైద్య సేవల కోసం తన వంతు కృషి చేస్తానన్నారు.

చీఫ్ సెక్రటరీకి శుభాకాంక్షలు



చేవెళ్ల: రాష్ట్ర ప్రభుత్వ నూతన ప్రధానకార్యదర్శిగా నియమితులైన రామకృష్ణరావును రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యుడు చింపుల సత్యనారాయణ రెడ్డి కలిశారు. నగరంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సచివాలయంలో శుక్రవారం చీఫ్ సెక్రటరీని మార్యదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

రికార్డు 'ఎర్లీబర్డ్'.. రూ.900.93 కోట్లు

సాక్షి, సిటీబ్యూరో: ఎర్లీబర్డ్ పథకం వల్ల రికార్డు స్థాయిలో రూ. 900.93 కోట్ల ఆస్తిపన్ను వసూలైనట్లు జీహెచ్ఎంసీ పేర్కొంది. ఈ పథకం వల్ల గత సంవత్సరం రూ. 831.23 కోట్లు వసూలు కాగా, ఈ సంవత్సరం అంతకుంటే ఎక్కువ వసూలైనట్లు ఒక ప్రకటనలో తెలిపింది. ఆర్థిక సంవత్సరం మొదటి నెల ఏప్రిల్‌లోనే ఏడాది ఆస్తి పన్నును చెల్లించేవారికి 5 శాతం రాయితీ ఇవ్వడమే 'ఎర్లీబర్డ్' పథకం. 7,93,552 మంది ఆస్తిపన్ను చెల్లింపుదారులు ఈ సదుపాయాన్ని వినియోగించుకున్నారు. ఎర్లీబర్డ్ ద్వారా ఆస్తిపన్ను వసూళ్లు ఏటికేడు పెరుగుతోంది. 2023-24లో రూ.785.94 కోట్లు, 2024-25లో రూ. 831.23 కోట్లు, 2025-26లో రూ. 900.93 కోట్లు ఆదాయం సమకూరింది.

పేదల సంక్షేమమే ధ్యేయం

కొందుర్గు: పేదల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందని కేశంపేట జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు తాండ్ర విశాల అన్నారు. శుక్రవారం కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రాజు ఆధ్వర్యంలో చౌదరిగూడలో ఏర్పాటు చేసిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆమె హాజరై మాట్లాడారు. అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని, పేదలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఫలితం లేదు!

పది రిజల్ట్స్‌లో మూడేళ్లుగా చివరి స్థానంలోనే జిల్లా

ప్రభుత్వ పాఠశాలలను సందర్శించిన ప్రతీసారి విద్యాశాఖ ఉన్నతాధికారులు ఒకే మాట చెప్పారు.. పదిలో ఉత్తమ ఫలితాలే లక్ష్యమని.. ఇందుకోసం పక్కా ప్రణాళికతో సాగుతున్నామని, మెరుగైన ఫలితాలు వస్తాయని ఊదరగొట్టారు.. కానీ వారి మాటలకు వాస్తవ పరిస్థితులకు ఎక్కడా పొంతన కుదరలేదు. ఇటీవల విడుదలైన టెన్త్ ఫలితాల్లో మన జిల్లా రాష్ట్రంలోనే చివరి స్థానంలో నిలవడం వీరి పనితీరుకు అద్దం పడుతోంది.

- అయినా మేల్కోని విద్యాశాఖ
- అధికారుల పనితీరుపై తల్లిదండ్రుల ఆగ్రహం
- పూర్తిస్థాయి సిబ్బంది ఉన్న చోటా 30 శాతంలోపే ఉత్తీర్ణత
- సమీక్ష చేయని జిల్లా యంత్రాంగం



వికారాబాద్: తాజాగా విడుదలైన పదో తరగతి ఫలితాల్లో జిల్లా అట్టడుగున నిలవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. విద్యాశాఖ పనితీరుపై తల్లిదండ్రులు, ప్రజా సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఉమ్మడి జిల్లాగా ఉన్న సమయంలో మన ప్రాంతానికి టాప్ ఫైవ్‌లో చోటుదక్కేది.జిల్లాల విభజన తర్వాత కరోనా బ్యాచ్‌లు మినహా ఒక్క సారి కూడా కనీస స్థానం దక్కించుకోలేక పోయింది. ఈ సారి ఏకంగా రాష్ట్రంలోనే చివరి స్థానానికి పడిపోయి అపఖ్యాతిని మూటగట్టుకుంది. విద్యాశాఖపై మూడేళ్లుగా విమర్శలు వెల్లువెత్తుతున్నా దిద్దుబాటు చర్యలు తీసుకున్న పాపాన పోలేదు. ఇంతజరుగుతున్న ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు పట్టనట్లుగా వ్యవహరిస్తుండటం ఆందోళన కలిగిస్తోంది.

3,344 మంది ఫెయిల్

జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ స్కూళ్లలో 12,846 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయగా 9,502 మంది ఉత్తీర్ణులయ్యారు. ఏకంగా 3,344 మంది ఫెయిల్ అయ్యారు. ఒక్క గణితం సబ్జక్టులోనే 2,639 మంది విద్యార్థులు తప్పారు. సైన్స్‌లో 1,474 విద్యార్థులు ఫెయిల్ అయ్యారు. వేలకు వేలు ఫీజులు వసూలు చేసే ప్రైవేటు పాఠశాలల్లో సైతం రాష్ట్ర సగటుకంటే తక్కువ ఉత్తీర్ణత రావడం విమర్శలకు తావిస్తోంది. గురుకులాల్లో మంచి ఫలితాలు రాగా మోడల్ స్కూళ్లు, ఆశ్రమ పాఠశాలలు, జిల్లా పరిషత్ పాఠశాలల్లో ఉత్తీర్ణత శాతం దారుణంగా పడిపోయింది. విద్యాశాఖ ఘోర వైఫల్యాలను మూటగట్టుకుంది. పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించకపోవడం, బోధన సక్రమంగా లేకపోవడం, పర్యవేక్షణ లోపం వల్ల ఇలాంటి ఫలితాలు వచ్చాయని పలువురు అభిప్రాయ పడుతున్నారు. పూర్తిస్థాయి ఉపాధ్యాయులు ఉన్న పాఠశాలల్లోనూ ఫలితాలు దారుణంగా వచ్చాయి. అన్ని సబ్జెక్టులకు ఉపాధ్యాయులు ఉండి కూడా ఒకరిద్దరు మాత్రమే పాస్ కావడం సిబ్బంది పనితీరుకు అద్దం పడుతోంది.

పూర్తిస్థాయి సిబ్బంది ఉన్నా..

నవాబుపేట మండలం అక్నాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 23 మంది విద్యార్థులు ఉండగా ఆరుగురు ఉపాధ్యాయులు ఉన్నారు. పదో తరగతి పరీక్షలకు ఐదుగురు విద్యార్థులు హాజరు కాగా ఒక్కరు మాత్రమే పాసయ్యారు. ఇదే మండలంలోని నారెగూడ స్కూల్‌లో మొత్తం 13 మంది విద్యార్థులు ఉండగా ఆరుగురు ఉపాధ్యాయులు ఉన్నారు. ముగ్గురు విద్యార్థులు పది పరీక్షలు రాయగా ఒక్కరే పాసయ్యారు.

- పెద్దేముల్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో 102 మంది విద్యార్థులు.. ఏడుగురు ఉపాధ్యాయులు ఉన్నారు. పది పరీక్షలకు 16 మంది విద్యార్థులు హాజరు కాగా ఇద్దరే ఉత్తీర్ణత సాధించారు. ఇదే మండలంలోని తట్టెపల్లి స్కూల్లో 150 మంది విద్యార్థులు.. 13 మంది ఉపాధ్యాయులు ఉన్నారు. 20 మంది పరీక్షలు రాయగా ఏడుగురే పాసయ్యారు.
- తాండూరు మండలం జినుగుర్తి ఉన్నత పాఠశాలలో 200 మంది విద్యార్థులు.. 12 మంది ఉపాధ్యాయులు ఉన్నారు. 30 మంది విద్యార్థులు పది పరీక్షలు రాయగా కేవలం 8 మంది మాత్రమే పాసయ్యారు.
- కుల్కచర్ల బాలురు ఉన్నత పాఠశాలలో 21 మంది ఉపాధ్యాయులు ఉన్నారు. ఇక్కడ 98 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 30 మంది ఉత్తీర్ణత సాధించారు. ఇదే మండలంలోని ఉప్పాయిపల్లి ఉన్నత పాఠశాలలో 56 మంది విద్యార్థులు.. 8 మంది ఉపాధ్యాయులు ఉన్నారు. 11 మంది పదో తరగతి పరీక్షలు రాయగా నలుగురు పాసయ్యారు. కుస్మ సముద్రం ఉన్నత పాఠశాలలో మొత్తం 68 మంది విద్యార్థులు.. ఏడుగురు ఉపాధ్యాయులు ఉన్నారు. 15 మంది పది పరీక్షలకు హాజరు కాగా నలుగురు పాసయ్యారు.
- పూడూరు మండలం కోడుమూర్ ఉన్నత పాఠశాలలో 46 మంది విద్యార్థులు.. ఏడుగురు ఉపాధ్యాయులు ఉన్నారు. ఎనిమిది మంది ఎగ్జామ్స్ రాయగా ముగ్గురే పాసయ్యారు.
- పరిగి జిల్లా పరిషత్ నంబర్ వన్ పాఠశాలలో 123 మంది పదో తరగతి పరీక్షలు రాయగా 58 మంది మాత్రమే పాసయ్యారు. నంబర్ టూ పాఠశాలలో 58 మందికి గాను 23 మంది ఉత్తీర్ణులయ్యారు. ఇదే మండలంలోని చిట్యాల్ ఉన్నత పాఠశాలలో 27 మంది పరీక్షలు రాయగా 9 మంది మాత్రమే పాసయ్యారు.

మొదటి స్థానంలో బొంరాస్‌పేట్ మండలం

జిల్లాలోని బొంరాస్‌పేట్ మండలం 93 శాతం ఫలితాలతో మొదటి స్థానంలో నిలవగా కుల్కచర్ల, పెద్దేముల్ మండలాలు 47 శాతం ఫలితాలతో చివరి స్థానంలో నిలిచాయి. జిల్లాలో ఎనిమిది పాఠశాలలు వందశాతం ఫలితాలు సాధించాయి. ప్రైవేటు పాఠశాలలకు చెందిన 303 మంది విద్యార్థులు ఫెయిల్ అయ్యారు.

ప్రజలను అప్రమత్తం చేయండి

కలెక్టర్ ప్రతీక్ జైన్



అనంతగిరి: ఎండల తీవ్రత పెరుగుతున్నందున ప్రజలు వడదెబ్బ బారిన పడకుండా అప్రమత్తం చేయాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ శుక్రవారం అధికారులకు సూచించారు. ఎండల కారణంగా జిల్లాలో ప్రాణ నష్టం జరగకుండా చూసుకోవాలన్నారు. వైద్య ఆరోగ్య శాఖతో పాటు, ఇతర శాఖల జిల్లా అధికారులు ఎండల వల్ల కలిగే ముప్పు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. వాతావరణ మార్పుల ప్రభావం వల్ల సాధారణ స్థాయికి మించి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని, ప్రజలు తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. మధ్యాహ్నం సమయంలో వీలైనంతవరకు ఇంట్లోనే ఉండాలని, ఒకవేళ బయటకు వెళ్లాల్సి వస్తే తలకు టోపీ ధరించడం, తువ్వాలు చుట్టుకోవడం, చేనేత వస్త్రాలు ధరించడం వంటి జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సాధ్యమైనంత వరకు ప్రయాణాలు పెట్టుకోకూడదని, చల్లదనం ఉండే చోటు ఉండాలన్నారు. వృద్ధులు, చిన్నారుల విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. కార్యాలయాలు, వ్యాపార, వాణిజ్య సంస్థల్లో పనిచేసే ఉద్యోగులు, కార్మికులు వడదెబ్బకు లోను కాకుండా తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. ఉపాధి పనులు జరిగే చోట కూలీలకు నీడ, తాగునీటి వసతి అందుబాటులో ఉండేలా జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుందని తెలిపారు. అన్ని ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సీహెచ్‌సీలలో వైద్యాధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ప్రజలు వడదెబ్బకు గురై ఆస్పత్రికి వస్తే తక్షణ చికిత్స చేయాలని ఆదేశించారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించండి

దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న విద్యుత్ సమస్యలను నెలరోజుల్లో పరిష్కరించాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో విద్యుత్ శాఖ ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలు, మీటర్లు, బోరు కనెక్షన్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి వాటిని సమకూర్చాలని సూచించారు. వ్యవసాయ రంగానికి సంబంధించిన పనులను అలసత్వం చేయరాదని సూచించారు. సమీక్షలో అదనపు కలెక్టర్ సుధీర్, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ హర్ష చౌదరి, విద్యుత్ శాఖ ఎస్ఈ రవి ప్రసాద్, డీఈ, ఏడీఈ, ఏఈలు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె

- టీజేఎంయూ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ స్వాములయ్య

షాద్‌నగర్‌రూరల్: ప్రభుత్వం, యాజమాన్యం ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పట్టించుకోకపోతే సమ్మెకు దిగుతామని తెలంగాణ జాతీయ మజ్దూర్ యూనియన్ (టీజేఎంయూ) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ స్వాములయ్య హెచ్చరించారు. పట్టణంలోని డిపో ఆవరణలో శుక్రవారం టీజేఎంయూ ఆధ్వర్యంలో సమ్మె వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా స్వాములయ్య మాట్లాడుతూ.. ఆర్టీసీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని ఏడు నెలలుగా జేఏసీ నాయకులు ప్రభుత్వానికి, యాజమాన్యానికి వినతులు ఇచ్చినా ఫలితం లేదని తెలిపారు. ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయడంతో పాటు ట్రేడ్ యూనియన్లపై ఆంక్షలను ఎత్తివేసి గుర్తింపు సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. 2017 వేతన సవరణ బకాయిలు చెల్లించి కొత్త అలవెన్సులు అమలు చేయాలని కోరారు. ఉద్యోగ భద్రత కల్పించి సిబ్బందిపై అధిక పనిభారం తగ్గించాలని, ఎంటిడబ్ల్యూ యాక్టు అమలు చేయాలన్నారు. ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయడంతో పాటు అర్హులైన వారికి ప్రమోషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కారుణ్య నియామకాలను రెగ్యులర్ ప్రాతిపదికన చేపట్టాలని, ప్రస్తుతం కన్సాలిడేటెడ్ పే కింద పని చేస్తున్న వారందరినీ రెగ్యులరైజ్ చేయాలని కోరారు.

ఏసీబీకి చిక్కిన సీనియర్ అసిస్టెంట్

- సహచర ఉద్యోగికి రావాల్సిన బిల్లులో లంచం డిమాండ్
- అవినీతి నిరోధక శాఖ అధికారులను ఆశ్రయించిన బాధితుడు
- ఎక్సైజ్ కార్యాలయంలో వలపన్ని పట్టుకున్న అధికారులు



ఏసీబీకి చిక్కిన సీనియర్ అసిస్టెంట్ శ్రీధర్

అనంతగిరి: ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో పనిచేస్తున్న ఓ సీనియర్ అసిస్టెంట్ రూ.8 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబట్టారు. అవినీతి నిరోధక శాఖ డీఎస్పీ ఆనంద్‌కుమార్ తెలిపిన వివరాలిలు ఇలా ఉన్నాయి.. వికారాబాద్‌లోని జిల్లా ఎక్సైజ్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేసే శ్రీధర్ ఉద్యోగుల జీతాలు, ఇతర బిల్స్ చేస్తాడు. ఇదే శాఖలో పనిచేస్తున్న సహచర ఉద్యోగికి 2022- 23 సంవత్సరానికి సంబంధించిన రూ.76 వేల పైచిలుకు బిల్లు రావాల్సి ఉంది. దీన్ని క్లియర్ చేయాలని శ్రీధర్‌ను కోరగా డబ్బులు అడిగాడు. మొత్తం బిల్లులో తనకు 11శాతం లంచంగా ఇవ్వాలని డిమాండ్ చేశాడు. లేదంటే బిల్ పాస్ చేసేది లేదని తేల్చి చెప్పాడు. అయితే తన వద్ద డబ్బు లేదని, బిల్లు వచ్చిన వెంటనే ఇచ్చేస్తానని ఉద్యోగి తెలిపాడు. ఇందుకు అంగీకరించిన శ్రీధర్ బిల్ పాస్ చేయడంతో ఇటీవల ఉద్యోగి ఖాతాలో డబ్బులు జమయ్యాయి. చెప్పిన విధంగా తనకు రూ.8 వేలు ఇవ్వాలని శ్రీధర్ పలుమార్లు అతనికి ఫోన్ చేశాడు. న్యాయబద్ధంగా తనకు రావాల్సిన బిల్లులో లంచం ఇవ్వడం ఏమిటని భావించిన సదరు ఉద్యోగి ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. శుక్రవారం సాయంత్రం 4.20 గంటలకు కార్యాలయంలో శ్రీధర్ రూ.8 వేల నగదు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అతని నుంచి నగదు స్వాధీనం చేసుకుని, అన్ని వివరాలు సేకరించారు. డబ్బులు తీసుకోవడంలో ఇంకా ఎవరి పాత్రయినా ఉందా అనే కోణంలోనూ విచారణ చేస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు. నిందితుడిని నాంపల్లిలోని కోర్టులో హాజరుపరుస్తామని చెప్పారు. ఏసీబీ దాడులు జరుగుతున్నాయనే విషయం క్షణాల్లో మిగితా కార్యాలయాలకు పాకింది. దీంతో అవినీతి అధికారులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు.

1064కు కాల్ చేయండి

జిల్లాలో ఎవరైనా ప్రభుత్వ ఉద్యోగి లంచం డిమాండ్ చేసినట్లయితే వెంటనే 1064 టోల్ ఫ్రీ నంబర్‌ను సంప్రదించాలని ఏసీబీ డీఎస్పీ తెలిపారు. 9440446106లో, ట్విట్టర్, ఫేస్‌బుక్ ద్వారా కూడా సమాచారం అందించవచ్చని సూచించారు.

రోడ్లపై కల్లాలు.. ప్రమాదాలకు నిలయాలు

- వాహనాల రాకపోకలకు ఇబ్బందులు
- రాత్రి వేళ ప్రయాణం మరింత ప్రమాదకరం
- చర్యలు తీసుకోవాలంటున్న వాహనచోదకులు



దుద్యాల్: సాగారం తండా - గౌరారం మార్గంలో ధాన్యం ఆరబోసిన రైతులు




బొంరాస్‌పేట: రోడ్డుపై ధాన్యం కుప్ప

దుద్యాల్: రోడ్లపైనే పంట ఉత్పత్తులను ఆరబోయడం, నూర్పిడి, రాసులు చేస్తుండటంతో వాహనాలు ప్రమాదాలకు గురువుతున్నాయి. గతంలో రైతులు గ్రామంలో కల్లాలు ఏర్పాటు చేసుకొని ధాన్యం, మక్కలు, వేరుశనగ తదితర పంటలను ఆరబెట్టేవారు. ప్రస్తుతం ప్రధాన రహదారుల పొడవునా పంట ఉత్పత్తులను ఆరబోస్తున్నారు. నిత్యం వేల సంఖ్యలో వాహనాలు తిరిగే ప్రాంతంలో నూర్పుడిలు చేస్తుండటంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. నూర్పిడి తర్వాత వ్యర్థాలను రోడ్లపైనే వదిలేసి పోతున్నారు. దీంతో వ్యర్థాలు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి. రాత్రి వేళ ప్రయణం కష్టంగా ఉందని వాహనచోదకులు తెలిపారు. రోడ్లపై కల్లాలు ఏర్పాటు చేయకుండా అధికారులు రైతులకు అవగాహన కల్పించాలని కోరుతున్నారు. మండలంలోని నాజుఖాన్‌పల్లి, చిలుముల్ మైల్వార్, సాగారం తండా, గౌరారం, హంసంపల్లి, చెట్టుపల్లి తండా మార్గాల్లో కల్లాలు ఏర్పాటు చేస్తున్నారు. ఈ మార్గాల్లో ప్రయాణం ఇబ్బందిగా ఉందని పలువురు తెలిపారు.

రోడ్లపైనే ధాన్యం రాసులు

బొంరాస్‌పేట: వరి ధాన్యం ఆరబోసుకునేందుకు రైతులు రహదారులను కల్లాలుగా మార్చుకుంటున్నారు. దీంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అంతేకాకుండా ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. మండలంలోని మెట్లకుంట నుంచి ఎన్కేపల్లి వరకు ధాన్యం నూర్పిడి కల్లాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. అధికారులు అవగాహన కల్పించి రహదారులపై నూర్పిడి జరగకుండా చూడాలని ప్రయాణికులు, వాహనచోదకులు కోరుతున్నారు.

అవగాహన కల్పించాలి



రోడ్లపై ధాన్యం ఆరబోయడం, కల్లాలు చేయడం వల్ల వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి. నూర్పిడి అనంతరం వ్యర్థాలను రోడ్లపైనే వదిలేసి వెళ్తున్నారు. దీంతో ద్విచక్ర వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి. అధికారులు రైతులకు అవగాహన కల్పించి ప్రమాదాలు జరగకుండా చూడాలి.

– ఆశన్న, వాహనచోదకుడు. దుద్యాల్ మండలం

రిజిస్ట్రేషన్.. నో టెన్షన్

- నిరీక్షణకు తెర
- మరింత సులభతరంగా స్థిరాస్తి రిజిస్ట్రేషన్లు
- సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ విధానం
- పది నుంచి పదిహేను నిమిషాల్లోనే పూర్తి కానున్న ప్రక్రియ
- రంగారెడ్డి జిల్లాలో ఆరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల ఎంపిక
- ఈనెల 12 నుంచి అమలు



షాద్‌నగర్: స్థిరాస్తి రిజిస్ట్రేషన్ల ప్రక్రియ మరింత సులభం కానుంది. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో దస్తావేజుల నమోదు కోసం గంటల తరబడి నిరీక్షించే అవసరం ఉండదు. పది నుంచి 15 నిమిషాల్లో ప్రక్రియ పూర్తి కానుంది. ఇందుకు గాను రిజిస్ట్రేషన్ల శాఖ సంస్కరణలు చేపట్టింది. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ విధానానికి శ్రీకారం చుట్టింది. ఈ విధానాన్ని అమలు చేసేందుకు జిల్లాలోని ఐదు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలను ఎంపిక చేశారు.

రెండో విడతలో భాగంగా..

రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ విధానానికి మంచి స్పందన వచ్చింది. విడతల వారీగా ఈ విధానాన్ని అమలు చేస్తున్నారు. ఈనెల 12 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా మరిన్ని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అమలు చేయనున్నారు. రెండో విడతలో భాగంగా జిల్లాలోని ఫరూఖ్‌నగర్, షాద్‌నగర్, మహేశ్వరం, వనస్థలిపురం, శేరిలింగంపల్లి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలను ప్రభుత్వం ఎంపిక చేసింది. స్లాట్ బుకింగ్ విధానాన్ని ఈ కార్యాలయాల్లో ప్రయోగాత్మకంగా అమలు చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. మొదటి విడతలో శంషాబాద్, సరూర్‌నగర్, చంపాపేట్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు ఎంపిక కావడంతో అక్కడ ఇప్పటికే స్లాట్‌బుకింగ్ విధానం కొనసాగుతోంది.

అనుకున్న సమయానికి ..

దస్తావేజుల రిజిస్ట్రేషన్ కోసం అనుకున్న సమయానికి, తేదీకి, ఆన్‌లైన్‌లోనే స్లాట్ బుకింగ్ చేసుకోవచ్చు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు, ఆ తర్వాత 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు స్లాట్ బుకింగ్ చేసుకోవచ్చు. స్లాట్ బుకింగ్ చేసుకున్న సమయానికి కార్యాలయానికి వచ్చి రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకొని వెళ్లిపోవచ్చు.

స్వయంగా దస్తావేజుల తయారీ

స్థిరాస్తి దస్తావేజులు నమోదు చేసుకునే వారు డాక్యుమెంట్ రైటర్లపై ఆధారపడకుండా స్వయంగా తయారు చేసుకోవడానికి వెబ్‌సైట్‌లో ప్రత్యేక మాడ్యూల్ ప్రవేశపెట్టారు. మొదటగా సేల్ డీడ్ దస్తావేజుల కోసం వెసులుబాటు ఉంది. రిజిస్ట్రేషన్ సమయంలో దస్తావేజుపై అమ్మినవారు, కొన్నవారు, సాక్షులు తర్వాత సబ్‌రిజిస్ట్రార్ సంతకాలు చేయడం, వాటిని స్కానింగ్ చేయడానికి సుమారు గంట సమయం పడుతుంది. రిజిస్ట్రేషన్ల ప్రక్రియలో జరిగే జాప్యాన్ని నివారించేందుకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ చాట్‌బోర్ట్స్ సేవలను అందుబాటులోకి తెచ్చారు.

రూ.40 కోట్ల ప్రభుత్వ భూమికి విముక్తి



ప్రభుత్వ భూమి చుట్టూ వేసిన ఫెన్సింగ్

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ముప్పై ఏళ్ల క్రితమే కబ్జాకు గురైన రూ.40 కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూమికి రెవెన్యూ అధికారులు మూడు రోజుల క్రితం విముక్తి కల్పించారు. ఇప్పటికే రెండుసార్లు సర్వే చేయడంతో పాటు భూమి చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. సరూర్‌నగర్ మండలం లింగోజిగూడ డివిజన్ సర్వే నంబర్ 86లో 1.21 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఓ పార్టీకి చెందిన నేత దీనిపై కన్నేశాడు. పక్కనే ఉన్న ప్రైవేటు పట్టాదారును ఉసిగొల్పి ప్రభుత్వ భూమిని పట్టా భూమిలో కలిపేందుకు యత్నించాడు. ఇప్పటికే ఆ భూమిలో నాలుగు తాత్కాలిక గదులు నిర్మించి కూలీలకు అద్దెకిచ్చాడు. ఇతరులెవరినీ లోనికి అడుగు పెట్టకుండా ప్రైవేటు సెక్యూరిటీతో నిఘా ఏర్పాటు చేశాడు. ఖాళీ స్థలాన్ని తన సొంత స్థలంగా నమ్మించి అందులో ప్రైవేటు కార్లు, బస్సులు, ఇతర భారీ వాహనాల పార్కింగ్ కోసం అద్దెకిచ్చాడు. విషయం రెవెన్యూ అధికారులకు తెలిసింది. ఏళ్లుగా ప్రైవేటు వ్యక్తి చెరలో చిక్కిన ప్రభుత్వ భూమికి విముక్తి కల్పించాలని నిర్ణయించారు. కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశాల మేరకు ఆర్డీఓ వెంకట్‌రెడ్డి, తహసీల్దార్ వేణుగోపాల్ క్షేత్రస్థాయికి చేరుకుని భూమిని పరిశీలించారు. నాలుగు నెలల్లో మూడుసార్లు పరిశీలించడంతోపాటు పక్కగా సర్వే చేయించారు. మూడు రోజుల క్రితం చుట్టూ హద్దురాళ్లను ఏర్పాటు చేయడంతో పాటు ఫెన్సింగ్ వేయించారు. తాత్కాలిక గదుల్లో అద్దెకున్న వారంతా వారం రోజుల్లో ఖాళీ చేసి వెళ్లిపోవాల్సిందిగా ఆదేశించారు. లేదంటే ఆ నివాసాలను కూల్చివేయనున్నట్లు హెచ్చరించారు. ఇదే భూమికి సమీపంలో ఉన్న మరో 250 గజాల స్థలాన్ని కూడా అధికారులు రక్షించారు.

క్లుప్తంగా

సీనియర్ టెక్నీషియన్ బలవన్మరణం


రాజశేఖర్‌రెడ్డి (ఫైల్)

తాండూరు రూరల్: సోలార్‌ప్లాంట్‌లో పని చేసే టెక్నీషియన్ ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన పెద్దేముల్ మండలం ఇందూరు శివారులోని సోలార్‌ప్లాంట్‌లో శుక్రవారం వెలుగులోకి వచ్చింది. ఎస్‌ఐ శ్రీధర్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. పెద్దేముల్ మండలం గోపాల్‌పూర్ గ్రామానికి చెందని మాదారపు రాజశేఖర్‌రెడ్డి(37) ఏడేళ్లుగా లిండ్‌స్టోత్ సోలార్ కంపెనీలో సీనియర్ టెక్నీషియన్‌గా పని చేస్తున్నాడు. రోజుమాదిరిగానే గురువారం విధులకు వెళ్లిన రాజశేఖర్‌రెడ్డి శుక్రవారం ఉదయం ఇంటికి రాలేదు. దీంతో మృతుడి తండ్రి బాల్‌రెడ్డి కుమారుడికి ఫోన్ చేసినా సమాధానం రాలేదు. కాసేపటికి అదే గ్రామానికి చెందిన బట్టల జైపాల్‌రెడ్డి మీకుమారుడు ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడి తండ్రికి చెప్పాడు. దీంతో ఆయన గ్రామస్తులతో కలిసి ప్లాంట్‌కు వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. సోలార్‌ప్లాంట్‌లోని గదిలో ఫ్యాన్‌కు నైలాన్ తాడుతో ఉరేసుకుని విగతజీవిగా కనిపించాడు. తన కుమారుడికి ఎలాంటి సమస్యలు లేవని ప్లాంట్ యాజమాన్యంపైనే అనుమానం ఉందని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు రూరల్ సీఐ నగేశ్ ఘటనా స్థలికి వెళ్లి పరిశీలించారు. పట్టణంలోని జిల్లా ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడికి భార్య విశాల, కూతురు శ్రీజ, కుమారుడు భరత్‌రెడ్డి ఉన్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

అపస్మారక స్థితిలో గుర్తుతెలియని వ్యక్తి



తాండూరు రూరల్: అపస్మారక స్థితిలోకి వెళ్లిన ఓ గుర్తు తెలియని వ్యక్తిని కరన్‌కోట్ యువకులు శుక్రవారం ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. కొన్ని రోజులుగా గ్రామంలోని బంగారమ్మ ఆలయం వద్ద గుర్తు తెలియని వ్యక్తి ఉంటున్నాడు. ఆయన వివరాలు తెలుసుకునేందుకు యత్నించినా చెప్పలేకపోతున్నాడు. వేసవి ఉష్ణోగ్రతలు పెరగడంతో వడదెబ్బ తగిలి ఉంటుందని భావించిన యువ నాయకుడు శ్రీనివాస్ పంచాయతీ కార్మికులతో 108 వాహనంలో ఆస్పత్రికి తరలించారు. అనాథ వ్యక్తి యాలాల మండలం కోకట్ వాసిగా అనుమానిస్తున్నారు.

మట్టిని తరలిస్తున్న వాహనాలు సీజ్

మాడ్గుల: అక్రమంగా మట్టి తరలిస్తున్న వాహనాలను సీజ్ చేసినట్లు సీఐ వేణుగోపాల్‌రావు తెలిపారు. మండల పరిధిలోని అందుగుల శివారులోని వాగు నుంచి శుక్రవారం ఉదయం అక్రమంగా మట్టి తరలిస్తుండగా పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు వాహనాలను తనిఖీ చేపట్టారు. ఎలాంటి అనుమతులు లేకపోవడంతో సీజ్ చేసి డ్రైవర్లు, వాహన యజమానులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఓఆర్‌ఆర్‌పై కారు బోల్తా
యువకుడి దుర్మరణం


ఓఆర్‌ఆర్ ఎగ్జిట్-12 వద్ద బోల్తా పడిన కారు

ఇబ్రహీంపట్నం: అతివేగం కారణంగా కారు బోల్తాపడి ఓ యువకుడు దుర్మరణం చెందాడు. ఈ ఘటన శుక్రవారం ఆదిబట్ల ఠాణా పరిధిలో ఔటర్ రింగ్‌రోడ్డుపై చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. యాచారం మండలం నల్లవెల్లికి చెందిన దేరంగుల తిరుమలేశ్(35) నగరంలోని గచ్చిబౌలి నుంచి ఓఆర్‌ఆర్ మీదుగా స్వగ్రామానికి ప్రయాణిస్తున్నాడు. ఈ క్రమంలో బొంగులూరు ఎగ్జిట్-12 వద్దకు రాగానే అదుపుతప్పిన కారు డివైడర్‌ను ఢీకొట్టి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో కారు నడుపుతున్న తిరుమలేశ్ తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు దర్యాప్తులో ఉంది.

యువకుడి ఆత్మహత్య



సంగమేశ్వర్(ఫైల్)

షాబాద్: అనారోగ్యంతో బాధపడుతున్న యువకుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన షాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ సతీశ్‌కుమార్ తెలిపిన ప్రకారం..మండల పరిధిలోని రుద్రారం గ్రామానికి చెందిన జట్ట సంగమేశ్వర్(22) 15 ఏళ్లుగా అనారోగ్యంతో బాధపడుతూ పలు ఆస్పత్రుల్లో చికిత్స పొందాడు. గురువారం తండ్రి నర్సింలు సంగమేశ్వర్‌ను మొయినాబాద్‌లోని భాస్కర్ ఆస్పత్రిలో వైద్య పరీక్షలు చేయించి ఇంటికి తీసుకువచ్చాడు. ఫలితం లేకపోవడంతో మనోవేదనకు గురైన సంగమేశ్వర్ పొలానికి వెళ్తున్నాని చెప్పి అక్కడ పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తండ్రి పొలానికి వెళ్లి చూడగా అప్పటికే మృతిచెందిన కుమారుడిని చూసి బోరులన విలపించాడు. శుక్రవారం మృతుడి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తులో ఉంది.

బీఎస్ఎన్ఎల్ సేవలు డీలా

- కనుమరుగైన ల్యాండ్ ఫోన్లు
- మూతబడిన ఎస్టీడీ బూత్‌లు
- నిరుపయోగంగా మారిన టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ భవనాలు


ఎన్నారంలో మూతబడిన టెలిఫోన్ ఎక్ఛేంజ్ భవనం


బంట్వారంలో మూతబడిన బీఎస్ఎన్ఎల్ కార్యాలయం

బంట్వారం: భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ (బీఎస్ఎన్ఎల్) సంస్థ సేవలు నానాటికి కనుమరుగవుతున్నాయి. ఒకప్పుడు ప్రతీ గ్రామంలో సేవలు అందుబాటులో ఉండేవి. మొదట్లో ఏరియా పరిధిలోని టెలిఫోన్ ఎక్ఛేంజ్‌ల నుంచి రోడ్డు వెంట స్తంభాలు ఏర్పాటు చేసి గ్రామాలకు ల్యాండ్ ఫోన్ సౌకర్యం కల్పించారు. అనంతరం కేబుల్ ద్వారా టెలిఫోన్ వ్యవస్థను నడిపించారు. కాలక్రమంలో ల్యాండ్ ఫోన్లు కనుమరుగయ్యాయి. సెల్‌ఫోన్లు మార్కెట్‌లోకి రావడంతో ఒకప్పుడు బాగా నడిచిన ఎస్టీడీ, ఐఎస్డీ టెలిఫోన్ బూత్‌లు మూతబడ్డాయి. తదనంతరం వచ్చిన కాయిన్ బాక్స్‌లు కథ కంచికి చేరింది. 30 ఏళ్ల క్రితం పరుగులు పెట్టిన బీఎస్ఎన్ఎల్ సేవలు ఇప్పుడు పూర్తిగా డీలా పడ్డాయి. బంట్వారం, ఎన్నారం గ్రామాల్లో 25 సంవత్సరాల క్రితమే టెలిఫోన్ ఎక్ఛేంజ్‌లు ఏర్పాటు చేశారు. అప్పట్లో వీటికి పక్కా భవనాలు సైతం నిర్మించారు. బీఎస్ఎన్ఎల్ సేవలు నిలిచి పోవడంతో ఈ భవనాలు వృథాగా మారాయి.

సెల్‌ఫోన్ల రాకతో తగ్గిన వినియోగం

సెల్‌ఫోన్లు మార్కెట్‌లోకి రావడంతో బీఎస్ఎన్ఎల్ సేవలు తగ్గుతూ వచ్చాయి. వివిధ ప్రైవేటు కంపెనీలు ఆఫర్లతో వినియోగదారులను ఆకర్శిస్తూ మార్కెట్‌లో దూసుకుపోయాయి. ఈ పరిస్థితుల్లో బీఎస్ఎన్ఎల్ పూర్తిగా చేతులెత్తేసింది. ప్రస్తుతం పట్టణాలకే పరిమితమైంది. అక్కడక్కడ కొనసాగే ఇంటర్నెట్ కనెక్షన్లతోనే నెట్టుకొస్తున్నారు. ప్రభుత్వ ఆఫీసుల్లోనూ ప్రైవేట్ ఇంటర్నెట్ కనెక్షన్లు ఏర్పాటు చేసుకుని పనులు చక్కబెడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత టెలికమ్యూనికేషన్ శాఖ ఉన్నతాధికారులు స్పందించి బీఎస్ఎన్ఎల్‌కు మళ్లీ పూర్వ వైభవం తీసుకు రావాల్సిన అవసరం ఉంది.

ఎవెన్యూ ప్లాంటేషన్ మొక్కలు దగ్ధం


ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ రతన్‌సింగ్

తాండూరు రూరల్: పెద్దేముల్ మండలం హన్మాపూర్ గేటు వద్ద ఎవెన్యూ ప్లాంటేషన్ మొక్కలు దగ్ధమయ్యాయి. ఈ సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. వివరాలు.. తాండూరు-జహీరాబాద్ మార్గంలోని రోడ్డుకు ఇరువైపులా అధికారులు ఎవెన్యూ ప్లాంటేషన్ కింద మొక్కలు నాటారు. హన్మపూర్ గేటు సమీపంలో శుక్రవారం నిప్పంటుంకుని రోడ్డుకు ఇరువైపులా ఉన్న మొక్కలు దగ్ధమయ్యాయి. గమనించిన స్థానికులు మంటలు ఆర్పి విషయాన్ని కలెక్టర్ ప్రతీక్‌జైన్‌కు ఫోన్‌లో సమాచారం ఇచ్చారు. కలెక్టర్, డీఆర్‌డీఏ ఆదేశాల మేరకు పెద్దేముల్ ఎంపీడీఓ రతన్‌సింగ్, పంచాయతీ కార్యదర్శి నర్సింలు ఘటనా స్థలిని పరిశీలించారు. పరిస్థితిని కలెక్టర్‌కు ఫోన్‌లో వివరించినట్లు ఎంపీడీఓ రతన్‌సింగ్ వెల్లడించారు.

కళాశాల నిర్మాణానికి రూ.11లక్షల విరాళం


చెక్కును అందజేస్తున్న వ్యాపారవేత్తలు

షాద్‌నగర్: దాతల సహకారంతో షాద్‌నగర్ పట్టణంలో నిర్మిస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల నిర్మాణానికి వ్యాపారవేత్తలు, రవి ఫ్రూట్స్ సంస్థ వారు భారీ విరాళం అందజేశారు. ఈ మేరకు వారు శుక్రవారం రూ.11లక్షల చెక్కును ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో రవి ఫ్రూట్స్ సంస్థ అధినేతలు రవికుమార్ అగర్వాల్, కేదార్‌నాథ్ అగర్వాల్, రాజేందర్‌కుమార్ అగర్వాల్ ఎమ్మెల్యేను కలిసిన రవికుమార్ అగర్వాల్ విరాళానికి సంబంధించిన చెక్కును అందజేశారు.

సీడ్స్ షాప్‌లో నకిలీ మందులు విక్రయం
యజమానిపై కేసు

షాబాద్: నకిలీ మందులు విక్రయిస్తున్న న్యూ మారుతి సీడ్స్ దుకాణం పై కేసు నమోదయింది. ఈ ఘటన శుక్రవారం షాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ కాంతారెడ్డి తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని నాగర్‌గూడలో ఉన్న న్యూ మారుతి సీడ్స్ షాపులో సింజెంట కంపెనీకి చెందిన నకిలీ మందులు విక్రయిస్తున్నారని సదరు కంపెనీ మేనేజర్ కేషమసుధీర్‌కు సమాచారం అందింది. దీంతో అతడు అదే కంపెనీలో పనిచేసే రాకేశ్‌తో సినోడిస్ 200 మి.లీల మందు కొనుగోలు చేయించాడు. సదురు మందు డబ్బాపై ఉన్న లోగోలు వేరుగా ఉన్నట్లు గమనించి అది నకిలీదని గుర్తంచారు. షాపు యజామాని రాజశేఖర్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని సింజెంట కంపెనీ వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన గుర్తుతెలియని వాహనం

- విరిగిపడిన స్తంభం
- విద్యుత్ సరఫరాకు అంతరాయం


రోడ్డుపై పడిపోయిన స్తంభం, కేబుల్స్

ఇబ్రహీంపట్నం: గుర్తు తెలియని వాహనం విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. దీంతో స్తంభం విరిగి రోడ్డుపై పడడంతో విద్యుత్, కేబుల్ వైర్లు చెల్లాచెదురుగా పడిపోయాయి. ఈ ఘటన శుక్రవారం తెల్లవారుజామున పట్టణంలోని ఈశ్వరాంజనేయ స్వామి ఆలయం వద్ద చోటు చేసుకుంది. వివరాలు.. పట్టణం నుంచి రాయపోల్ వెళ్లే మార్గంలోని ఈశ్వరాంజనేయ ఆలయం వద్ద గుర్తు తెలియని వాహనం స్తంభాన్ని ఢీకొట్టింది. ఒక్కసారిగా పెద్ద శబ్దం వచ్చి విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో బస్తీవాసులు భయాందోళనకు గురయ్యారు. జనసంచారం లేని సమయంలో ఘటన చోటు చేసుకోవడంతో పెను ప్రమాదం తప్పింది. సాయంత్రం తాత్కాలిక మరమ్మతులు చేపట్టి విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు.

బైక్‌లపై గస్తీ

- సైబరాబాద్ షీ టీమ్స్‌కు ద్విచక్ర వాహనాల అందజేత
- మహిళల భద్రత మరింత వేగంగా

సాక్షి, సిటీబ్యూరో: మహిళల భద్రతను మరింత బలోపేతం చేసేందుకు సైబరాబాద్ షీ టీమ్స్ ముందడుగు వేసింది. బాధిత మహిళలను క్షణాల్లో చేరుకునేందుకు వీలుగా షీ టీమ్స్ పోలీసులకు ద్విచక్ర వాహనాలను అందజేశారు. భాగ్యనగర్ గ్యాస్ లిమిటెడ్ (బీజీఎల్), సైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ (ఎస్సీఎస్సీ) సహకారంతో 12 హోండా యాక్టివా స్కూటర్లను మహిళా పోలీసు సిబ్బందికి అందజేశారు. శుక్రవారం జరిగిన కార్యక్రమంలో సైబరాబాద్ పోలీసు కమిషనర్ అవినాష్ మహంతి మాట్లాడుతూ.. కమిషనరేట్ పరిధిలో మహిళలు, పిల్లల నిఘాను మెరుగుపరచడమే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. మహిళల భద్రత, సాధికారత వైపు, ప్రజా భద్రతను బలోపేతం చేయడానికి, వేగవంతమైన ప్రతిస్పందనను నిర్ధారించడంలో ఇది చురుకైన చర్యగా అభివర్ణించారు. సున్నితమైన ప్రదేశాలకు వేగంగా వెళ్లడానికి, నేరాలను నిరోధించడానికి, శాంతిభద్రతలను మరింత సమర్థవంతంగా నిర్వహించడానికి వీలు కలుగుతుందన్నారు. కార్యక్రమంలో జాయింట్ కమిషనర్ (ట్రాఫిక్) డాక్టర్ గజరావు భూపాల్, డీసీపీ (ఎస్‌బీ) సాయి శ్రీ; ఉమెన్ అండ్ చైల్డ్ సేఫ్టీ వింగ్ డీసీపీ సృజన కర్ణం, సీఏఆర్ హెడ్‌క్వార్టర్స్ డీసీపీ సంజీవ్; ఎస్సీఎస్సీ సీఈఓ నవేద్ ఖాన్, బీజీఎల్ ఎండీ రామ్ మోహన్ రావు కర్నాటి తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుడిని నమ్మించి..

రూ.5.60 లక్షలు దోపిడీ

- ఇద్దరు నిందితులకు రిమాండ్
- వివరాలను వెల్లడించిన పట్టణ సీఐ విజయ్‌కుమార్


వివరాలు వెల్లడిస్తున్న సీఐ విజయ్‌కుమార్

షాద్‌నగర్ రూరల్: స్నేహితుడిని నమ్మించి, నగదు దోచుకెళ్లడంతో పాటు ఎవరికైనా చెబితే చంపుతామని బెదిరించిన నిందితులను పోలీసులు శుక్రవారం రిమాండ్‌కు తరలించారు. పట్టణ సీఐ విజయ్‌కుమార్ తెలిపిన ప్రకారం.. నగరంలోని యూసుఫ్‌గూడలో నివాసం ఉంటున్న నాగేశ్వరం శ్రీధర్ సినీ డైరెక్టర్. శివరాంపల్లికి చెందిన రొయ్యల మల్లేశ్‌తో ఇతనికి పరిచయం ఉంది. ఈ నేపథ్యంలో షాద్‌నగర్ పరిధి విఠ్యాల వద్ద ఓ వెంచర్‌లో ప్లాటు అమ్మకానికి ఉందని, తక్కువ ధరకే ఇప్పిస్తానని శ్రీధర్ మల్లేశ్‌కు చెప్పాడు. అనంతరం షాద్‌నగర్‌కు చెందిన చింతోజు శ్రీధర్‌ను ఫోన్‌ద్వారా పరిచయం చేశాడు. స్నేహితుడి మాటలు నమ్మిన మల్లేశ్ ప్లాటును చూసేందుకు శివరాంపల్లికి చెందిన తన స్నేహితులు రవి, రాజుతో కలిసి గత నెల 27న కారులో షాద్‌నగర్‌కు వచ్చారు. ప్లాటుకు బయానా ఇచ్చేందుకు మల్లేశ్ రూ.5.60 లక్షలు తీసుకువచ్చాడు. నాగేశ్వరం శ్రీధర్ చెప్పినట్లుగా ప్లాటును చూపించేందుకు చింతోజు శ్రీధర్ స్నేహితులు శ్రీనాథ్ శ్రీకాంత్.. మల్లేశ్ పాటు అతని స్నేహితులను వెంచర్‌కు తీసుకెళ్లారు.

చంపుతామని బెదిరించి..

మల్లేశ్ కారులో డబ్బులు ఉన్న విషయాన్ని తెలుసుకున్న నాగేశ్వరం శ్రీధర్ ఎలాగైనా కాజేయాలని చింతోజు శ్రీధర్‌కు చెప్పాడు. వెంచర్ వద్ద ఎవరూ లేకపోవడంతో మల్లేశ్ కారుకు రాళ్లను అడ్డుగా పెట్టి అద్దాలు పగులగొట్టారు. మల్లేశ్, రవి, రాజుపై రాళ్లతో దాడిచేసి ఎవరికైనా చెబితే చంపుతామని బెదిరించారు. కారులో ఉన్న రూ.5.60 లక్షల నగదు తీసుకుని పరారయ్యారు. ఈ ఘటనపై గత నెల 29న కేసు నమోదుచేసిన పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు. సాంకేతిక పరిజ్ఞానంతో నిందితులను గుర్తించి ఈనెల 1న చింతోజు శ్రీధర్, నాగేశ్వరం శ్రీధర్‌ను అదుపులోకి తీసుకొని విచారించడంతో నేరం ఒప్పుకొన్నారు. నిందితుల నుంచి రూ.2.70 లక్షల నగదు, రెండు సెల్ ఫోన్లు, బైక్‌ను స్వాధీనం చేసుకుని నిందితులను రిమాండ్‌కు తరలించారు. మిగిలిన ఇద్దరు పరారీలో ఉన్నారు. కేసు ఛేదనలో కీలకంగా వ్యవహరించిన డీఐ వెంకటేశ్వర్లు, డీఎస్‌ఐ శివారెడ్డి, సిబ్బంది మోహన్, కరుణాకర్, జాకీర్, రాజు, రఫీని పోలీసు ఉన్నతాధికారులు అభినందించారు. వీరికి తగిన రివార్డులు అందజేస్తామని సీఐ తెలిపారు.

అద్దె ఇంటి కోసం వచ్చి..

మహిళను కట్టేసి 30 గ్రాముల బంగారు నగల చోరీ

సికింద్రాబాద్: ఇల్లు అద్దెకు కావాలని వచ్చిన ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి యజమానురాలిని కట్టేసి నగలు, నగదుతో ఉడాయించిన సంఘటన వారాసిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై సుధాకర్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పార్శిగుట్టలోని ఓ ఇంట్లోని మొదటి అంతస్తులో పారిజాతం (56) అనే మహిళ నివాసముంటోంది. శుక్రవారం మధ్యాహ్నం ఆమె ఇంటికి వచ్చిన ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు ఇల్లు అద్దెకు కావాలంటూ ఇంట్లోకి చొరబడ్డారు. తలుపులు గడియపెట్టి ఆమెను కత్తితో బెదిరించి కుర్చీలో కట్టేశారు. ఇంట్లో ఉన్న 30 గ్రాముల బంగారు నగలు, 6 వేల నగదు, సెల్‌ఫోన్‌ను తీసుకుని పరారయ్యారు. కొద్ది సేపటికి కట్లు విప్పుకుని బయటికి వచ్చిన పారిజాతం చుట్టుపక్కల వారికి విషయం చెప్పింది. స్థానికులతో కలిసి శుక్రవారం సాయంత్రం ఆమె వారాసిగూడ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసును నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. చిలకలగూడ ఏసీపీ జైపాల్‌రెడ్డి, ఇంచార్జి ఇన్‌స్పెక్టర్ రమేష్ గౌడ్, ఎస్సై సుధాకర్, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ ప్రకాశ్ రెడ్డి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. సీసీ కెమెరాల ఆధారంగా నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

రద్దీ ప్రదేశాలే లక్ష్యం

- బస్టాండ్లలో చోరీలకు తెగబడుతున్న ముఠా
- దోచుకున్న సొమ్ములు, డబ్బుతో స్వగ్రామానికి ఉడాయింపు
- గత నెల 17న పరిగి బస్టాండ్‌లో నగలు, నగదు చోరీ
- నిందితులను కటకటాల్లోకి పంపిన పోలీసులు
- వివరాలు వెల్లడించిన పరిగి డీఎస్పీ శ్రీనివాస్


వివరాలు వెల్లడిస్తున్న పరిగి డీఎస్పీ శ్రీనివాస్

పరిగి: రద్దీగా ఉండే ప్రదేశాలను లక్ష్యంగా చేసుకుని, దొంగతనాలకు పాల్పడుతున్న ముఠాను పోలీసులు కటకటాల్లోకి నెట్టారు. ఇందుకు సంబంధించిన వివరాలను పరిగి సీఐ కార్యాలయంలో డీఎస్పీ శ్రీనివాస్ విలేకరులకు వెల్లడించారు. గత నెల 17న పరిగి బస్టాండ్‌లో ఇద్దరు ప్రయాణికుల నుంచి నగదు, బంగారాన్ని గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. సీసీ కెమెరాలను పరిశీలించడంతో పాటు పాత నేరస్తులను విచారించి, వివిధ బస్టాండ్లలో జరిగిన చోరీల వివరాలను తెలుసుకుని, ఒక నిర్ధారణకు వచ్చారు. నంద్యాల జిల్లా, ఆత్మకూరు మండలం సిద్దాపురం గ్రామానికి చెందిన గుంజల గిద్దన్న, అతని భార్య ఆగిరమ్మ, కూతురు కీర్తి, అతని బావ ప్రసాద్‌ను నిందితులుగా గుర్తించారు. బస్టాండ్లు, రద్దీ ప్రదేశాలే టార్గెట్‌గా చోరీలు చేసి, సొంతూరుకు ఉడాయిస్తారని తెలుసుకున్నారు. ఎస్‌ఐ సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో సిద్దాపురం వెళ్లిన ప్రత్యేక పోలీసు బృందం నిందితులను పట్టుకుని, విచారించగా నేరం అంగీకరించారు. వీరినుంచి మూడు తులాల బంగారం, రూ.13 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఏ- 1 నిందితుడు గిద్దన్నపై పలు పోలీస్ స్టేషన్లలో 14 కేసులు ఉన్నట్లు తెలిపారు. ఆగిరమ్మపై పెబ్బేరు, వనపర్తి, పంజాగుట్ట పీఎస్‌లలో కేసులు ఉన్నాయన్నారు. దొంగలను పట్టుకుని న్యాయమూర్తి ఎదుట హాజరుపర్చిన అనంతరం రిమాండ్‌కు తరలించారు. ఎస్‌ఐ సంతోష్‌కుమార్, సిబ్బంది గోపాల్, జావిద్, బాలునాయక్‌లను డీఎస్పీ అభినందించారు. ఈ కార్యక్రమంలో సీఐ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

బీజేపీతోనే నూతన సంస్కరణలు


ప్రధాని చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రామచంద్రయ్య

పరిగి: అరవైఏళ్లు దేశాన్ని పాలించిన కాంగ్రెస్ ఎందుకు కులగణన చేపట్టలేదని.. నూతన సంస్కరణలు బీజేపీతోనే సాధ్యమని.. ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రామచంద్రయ్య అన్నారు. కేంద్ర ప్రభుత్వం జనగణనతో పాటు కుల గణన చేపట్టాలని నిర్ణయించడంతో శుక్రవారం బీజేపీ శ్రేణులు ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా రామచంద్రయ్య మాట్లాడుతూ.. కులగణనతో దేశంలోని అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేకూరుతుందన్నారు. దేశంలోని అన్ని పార్టీలు కులగణను స్వాగతిస్తున్నాయని చెప్పారు. రాష్ట్రం ప్రభుత్వం చేపట్టిన కులగణన అశాస్త్రీయంగా ఉందని.. కేంద్రం నిర్వహించే జనగణనతోనే ప్రజలకు న్యాయం చేకూరుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు రాముయాదవ్, కార్యదర్శి పెంటయ్యగుప్తా, పట్టణ అధ్యక్షుడు బాలకృష్ణారెడ్డి, మండల అధ్యక్షుడు ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా గోవుల తరలింపు


కంటైనర్‌లో గోవులు

ఇబ్రహీంపట్నం: కంటైనర్‌లో అక్రమంగా గోవులు తరలిస్తుండగా బీజేపీ నాయకులు వాటిని గోశాలకు తరలించారు. ఈ ఘటన ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాలు.. గురువారం రాత్రి మండల పరిధిలోని రాయపోల్ మీదుగా ఓ కంటైనర్‌లో 42 గోవులను తరలిస్తున్నారు. విషయం గమనించిన స్థానికులు మార్గ మధ్యలో వాహనాన్ని అడ్డుకుని పోలీసులకు సమాచారం ఇచ్చారు. గోవులను ఇరుకుగా ఉంచి హైదరాబాద్‌కు తరలిస్తున్నట్లు తెలుసుకుని వాహనాన్ని స్టేషన్‌కు తరలించారు. అనంతరం బీజేపీ శ్రేణులు పెద్ద ఎత్తున స్టేషన్‌కు చేరుకుని గోవులను సమీపంలోని గోశాలకు తరలించారు.

భగవద్రామానుజులు అందరికీ ఆదర్శం

శంషాబాద్ రూరల్: సమాజంలో అందరూ సమానమే అని చాటిన వ్యక్తి భగవద్రామానుజులు అని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. శుక్రవారం రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలంలోని సమతా స్ఫూర్తి కేంద్రంలో నిర్వహించిన శ్రీ భగవద్రామానుజుల 1008 జయంతి ఉత్సవాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పేదలు, నిమ్న వర్గాలను ఆధ్యాత్మిక భావన మార్గం చూపడంలో రామానుజాచార్య అందరికీ ఆదర్శమన్నారు. నాడు సమాజంలో అందరూ సమానమే అని చాటిన శ్రీ భగవద్రామానుజులు.. నేడు సమానత్వాన్ని చాటి చెబుతున్న చినజీయర్‌స్వామి మహనీయులని కొనియాడారు. ఈ మహోత్సవంలో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా చినజీయర్‌స్వామి గవర్నర్‌కు రామానుజుల మూర్తి జ్ఞాపిక, మంగళశాసనాలు అందజేశారు.

ఒక్కొక్కరికి రెండు జతలు

- పాఠశాల ప్రారంభం నాటికే యూనిఫాంలు అందజేసేందుకు చర్యలు
- ఇప్పటికే మహిళా సమాఖ్యలకు క్లాత్ అందజేసిన అధికారులు
- తయారీలో మహిళా సంఘాల సభ్యులు
- ఒక్కో జతకు రూ.50 చెల్లించనున్న ప్రభుత్వం


మహిళా సంఘం సభ్యులకు యూనిఫాం క్లాత్ అందజేస్తున్న ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డి

కేశంపేట: రానున్న విద్యా సంవత్సరం ప్రారంభం (జూన్12) రోజేనే విద్యార్థులకు యూనిఫాం అందించాలని భావిస్తున్న విద్యాశాఖ ఇందుకు కార్యాచరణ సైతం రూపొందించింది. ఇప్పటికే ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ పనిని మహిళా సమాఖ్యకు అప్పగించారు. గ్రామ మహిళా సంఘం ఆధ్వర్యంలో దుస్తులను కుట్టేందుకు ముందుకు వచ్చే మహిళలకు యూనిఫాం క్లాత్ అందిస్తున్నారు. వారు అధికారులు సూచించిన విధంగా యూనిఫాంను కుట్టి సకాలంలో మండల మహిళా సమాఖ్యకు అందించాల్సి ఉంటుంది. ఏప్రిల్ 29న మండల మహిళా సమాఖ్యకు వచ్చిన యూనిఫాం క్లాత్‌ను ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డి గ్రామాల మహిళా సంఘాల సభ్యులకు అందజేశారు.

సెలవులకు ముందే కొలతలు

మండల పరిధిలోని 29 గ్రామాల పరిధిలో 41 ప్రభుత్వ పాఠశాలల్లో 2,667 మంది విద్యార్థులున్నారు. వీరిలో 1,204 మంది బాలురు, 1,463 మంది బాలికలున్నారు. వీరికి ప్రభుత్వం ఉచితంగా ఏడాదికి రెండు జతల యూనిఫాంలను అందిస్తోంది. పాఠశాలలో ఉండే విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా జిల్లా అధికారులు పాఠశాలల పేరుతో వేర్వేరుగా బెల్ట్‌లు అందించారు. పాఠశాలలకు సెలవులు ఇవ్వకముందే అయా పాఠశాల్లో గ్రామాల్లోనే మహిళా సంఘం సభ్యులు విద్యార్థుల కొలతలను తీసుకుని యూనిఫాంను కుడుతున్నారు.


విద్యార్థుల కొలతలను తీసుకుంటున్న మహిళ సంఘం సభ్యురాలు (ఫైల్)

బాల, బాలికలకు వేర్వేరు..

జిల్లా విద్యాశాఖ విద్యార్థులకు తరగతుల వారీగా వేర్వేరు యూనిఫాంలను కుట్టిస్తోంది. అందులో భాగంగా 1 నుండి 5వ తరగతి వరకు బాలురకు షర్టు, నెక్కరు, బాలికలకు 1 నుంచి 3వ తరగతి వరకు ఫ్రాక్,షర్టు, 4, 5వ తరగతి విద్యార్థినులకు షర్టు మరియు స్కర్ట్ ఉండేలా సెలక్షన్ చేశారు. 6 నుంచి 12వ తరగతి వరకు విద్యార్థులకు షర్టు, ప్యాంట్, బాలికలకు పంజాబీ డ్రెస్, పైన వాస్కోట్‌లను ఎంపిక చేశారు. ఇందుకు గాను ఒక్క జతకు మహిళ సంఘం సభ్యులైన టైలర్లకు రూ.50కు చెల్లిస్తుంది. క్లాత్ కొలతల ప్రకారం కట్ చేయడానికి, కాజాబటన్లు, ట్రాన్స్‌పోర్టులాంటి ఖర్చులకు అదనంగా మరో రూ.25 చెల్లిస్తారు.

“వేసవి సెలవుల్లోనే పూర్తిచేస్తాం



విద్యార్థులకు పాఠశాలలు తెరిచేలోగా యూనిఫాంలను అందించేందుకు కృషి చేస్తున్నాం. వేసవి సెలవుల్లోనే మహిళా సంఘం సభ్యుల సహకారంతో అన్ని పాఠశాలలకు ప్రభుత్వం సూచించిన సంఖ్యకు అనుగుణంగా యూనిఫాంలు అందిస్తాం.

– భగవంతు, ఏపీఎం, కేశంపేట